క్లుప్తంగా

ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి వ్యక్తి మృతి

పాన్‌గల్: ప్రమాదవశాత్తుతో నీటి గుంతలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మాధరావుపల్లికి చెందిన కవీందర్‌నాయుడు (36) వ్యవసాయ పొలంలో నీటి నిల్వకు తవ్విన గుంతలో ప్రమాదవశాత్తుతో పడ్డాడు. బాధితుడికి ఈత రాకపోవడంతో నీట మునిగి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పోలింగ్

- మహబూబ్‌నగర్ సాధారణ ఎన్నికల పరిశీలకుడు సెవాంగ్ గ్యాచో భూటియా



అమరచింత/ఆత్మకూర్: పోలింగ్ కేంద్రాల్లో వసతులను కల్పించి ప్రశాంతమైన వాతావరణంలో పార్లమెంట్ ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎన్నికల పరిశీలకుడు సెవాంగ్ గ్యాచో భూటియా అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలించేందుకు శనివారం అమరచింత, ఆత్మకూర్ పట్టణాలకు వచ్చిన ఆయన పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా మున్సిపాలిటీలోని ఓటర్ల వివరాలతో పాటు పోలింగ్‌కేంద్రాల ఏర్పాటుపై తహసీల్దార్ చాంద్‌పాషాను అడిగి తెలుసుకున్నారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ కోసం వస్తున్న సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఫ్యాన్లను సిబ్బందికి అందుబాటులో ఉంచాలన్నారు. టెంట్లతో పాటు తాగునీటి వసతి, మరుగుదొడ్ల వ్యవస్థతో పాటు మౌలిక వసతులు కల్పించాలన్నారు. సమస్యాత్మక బూత్‌ల వద్ద నిఘా పెంచాలని పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు చాంద్‌పాషా, రాజు, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, సెక్టోరియల్ ఆఫీసర్లు ధర్మరాజు, భాస్కర్‌సింగ్, ఆర్ఐ గోపాల్ పాల్గొన్నారు.

బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలి

ఆత్మకూర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తే రాజ్యాంగ పరిరక్షణ సాధ్యమవుతుందని సీపీఐ జిల్లాకార్యదర్శి విజయరాములు అన్నారు. శనివారం జూరాలలో కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీహరి, మోష, రాబర్టు, రవీందర్, కుతూబ్, నర్సింహశెట్టి, మల్లేష్, ఖాజపీర్ ఉన్నారు.

వీపనగండ్ల: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మల్లు రవిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అఖిలపక్ష పార్టీల నాయకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో కాంగ్రెస్, సీపీఎం నాయకులు సమావేశమై బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, బీరయ్య యాదవ్, ఎత్తం కృష్ణయ్య, రవీందర్‌రెడ్డి, పోతుల వెంకట్‌రెడ్డి, ఆశన్న, మురళి తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: ఎన్డీఏ కూటమి పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించి ప్రజాస్వామ్యం కాపాడుదామని సీపీఐ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాజు, రాజన్న, సామేల్, కురుమన్న, రాంచందర్, భక్తి, ఏసన్న తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ

కాంగ్రెస్ పార్టీ బలపర్చిన మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా సీపీఎం ఆధ్వర్యంలో శనివారం పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జీఎస్ గోపి, వెంకటేష్, రమేష్, రాజు, అజయ్, బుచ్చన్న, శ్యామ్ సుందర్, రాఘవేందర్, నరసింహ పాల్గొన్నారు.

ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలు మరువలేనివి

వనపర్తిటౌన్: వైద్య రంగంలో కీలకమైన నర్సు వృత్తిలో ఫ్లోరెన్స్ నైటింగేల్ చేసిన సేవలు మరువలేనివని ప్రజా వాగ్గేయకారుడు రాజారామ్ ప్రకాశ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని టీజేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల అధ్యాపకులు ఇందిరా, ఝాన్సీ రాణి, సారా, సరస్వతి, మౌనిక, స్వాతి, లత, శివమ్మలను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నర్సింహశర్మ, నాగరాజు, బండారి శ్రీనివాస్, బాలేమియా, అధ్యాపకుడు రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.



మూడో ర్యాండమైజేషన్ పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి తేజస్ పవార్



ర్యాండమైజేషన్ పూర్తి చేస్తున్న కలెక్టర్ పవార్, పరిశీలకులు

వనపర్తి: జిల్లాలో ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేశామని జిల్లా ఎన్నికల అధికారి తేజస్ పవార్ తెలిపారు. శనివారం నాగర్‌కర్నూల్ ఐడీఓసీలో ఎన్నికల సాధారణ పరిశీలకులు, మూడు జిల్లాల ఎన్నికల అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పోలింగ్ సిబ్బందిని మూడో ర్యాండమైజేషన్ చేసి కేటాయించామని.. వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి సాధారణ పోలింగ్ కేంద్రాలు 296, ఆగ్జిలరీ పోలింగ్ కేంద్రాలు 11 మొత్తం 307 పోలింగ్ కేంద్రాలకు 20 శాతం అదనపు సిబ్బందితో కలిసి 1,476 మంది ఉన్నట్లు వివరించారు. వారిలో 369 ప్రిసైడింగ్ అధికారులు, 369 సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 738 ఓపీవోలు ఉన్నారన్నారు. వనపర్తి నియోజకవర్గంలో 1,35,876 మంది పురుషులు, 1,37,984 మంది మహిళలు, ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు ఓటర్లు మొత్తం 2,73,863 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. ఎన్నికలు పారదర్శకంగా ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ సిబ్బందితో పాటు కేంద్ర సాయుధ బలగాలను మోహరించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, వెబ్ కెమెరాలు, అవసరమైన చోట వీడియో చిత్రీకరణకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల వారీగా మొత్తం 32 రూట్లను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో 162 మంది దివ్యాంగులు, 103 వృద్ధులు మొత్తం 269 మంది హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోగా 254 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, అత్యవసర సేవల సిబ్బంది 2,718 మంది తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ విధానంలో వినియోగించుకున్నట్లు చెప్పారు.

ఓటింగ్ శాతం పెంచేందుకు జిల్లాలో 7 ఆదర్శ, 5 మహిళ, ఒక యువ, ఒక దివ్యాంగుల ఓటింగ్ కేంద్రాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు.

ముగిసిన ప్రచారం..

ఎన్నికల సంఘం నిబంధనల మేరకు శనివారం సాయంత్రం 6 వరకు ప్రచారం ముగించారు. ప్రచారం కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు నియోజకవర్గం వదలి వెళ్లాలని.. పోలింగ్ రోజు సోమవారం సాయంత్రం 6 వరకు మద్యం, కల్లు దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

లోక్‌సభ ఎన్నికలకు పటిష్ట భద్రత

- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నజర్
- ఎన్నికల విధుల కోసం 1,233 మంది జిల్లా, కేంద్ర బలగాలు
- ఎస్పీ రక్షితా కె.మూర్తి



మాట్లాడుతున్న ఎస్పీ రక్షితా కె.మూర్తి

వనపర్తి: లోక్‌సభ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా, కేంద్ర పోలీసు బలగాలు 1,233 మందితో బందోబస్తు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ రక్షితా కె.మూర్తి వెల్లడించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలీస్ అధికారుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి మండలానికి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారితో ప్రత్యేక పెట్రోలింగ్ బృందాలు, రూట్ మొబైల్స్, 61 క్విక్ రియాక్షన్ టీమ్స్ (క్యూఆర్‌టీ), స్ట్రయికింగ్ ఫోర్స్ టీమ్స్ 15, స్పెషల్ స్ట్రయికింగ్ టీమ్స్ 4 , కేంద్ర బలగాలు, కర్ణాటక హోమ్ గార్డ్స్ 300 మందితో పాటు పోలింగ్ స్టేషన్ల వద్ద ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వారిని వలంటీర్లుగా నియమిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 556 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. అందులో సాధారణ పోలింగ్ కేంద్రాలు 453, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 103 ఉన్నట్లు గుర్తించామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక రూ.1.40 కోట్ల పైబడి నగదు, రూ.12 లక్షల విలువ చేసే లిక్కర్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. గతంలో ఎలక్ట్రోరల్ నేరాలకు పాల్పడ్డ వ్యక్తులను, అందుకు సహకరించిన వ్యక్తులను బైండోవర్ చేశామని, రౌడీ షీటర్లను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నామన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన రోజు నుంచి ఇప్పటి వరకు జిలాల్లో 2 నిబంధనల ఉల్లంఘనల కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

లైసెన్స్ గన్స్ సరెండర్

ఎన్నికల సంఘం నిబంధనల మేరకు జిల్లాలోని 184 లైసెన్స్ గన్స్ ఉండగా.. అన్నింటిని డిపాజిట్ చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి ప్రచారానికి వచ్చిన వారు జిల్లా విడిచి పోవాలని, లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లు, హోటళ్లలో బస చేస్తున్న ఇతర ప్రాంతాల వారు, రాజకీయ పార్టీల వారు ఉండరాదన్నారు. నిబంధనలు మీరితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లాలో 144 సెక్షన్ అమలు

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా శనివారం సాయంత్రం ఆరు నుంచి సోమవారం ఎన్నిక ముగిసే వరకు జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్పీ రక్షిత కె.మూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నలుగురు అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా తిరగరాదని, బహిరంగ సభలు, ర్యాలీలపై నిషేధం ఉంటుందని, పోలింగ్ రోజున గుమిగూడటం, ఇతరులు పోలింగ్ స్టేషన్‌కు 100 మీటర్ల గీతదాటి ఎవరూ లోనికి వెళ్లొద్దని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గుర్తుంచుకొని పోలీసు అధికారులు, సిబ్బందికి సహకరించాలన్నారు. ఎవరైనా ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే వెంటనే సి-విజిల్ యాప్‌లోగాని, డయల్ 100కు గాని, దగ్గర్లోని పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బి.మోహన్‌రెడ్డి

కొత్తకోట: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ బి.మోహన్‌రెడ్డి, పీఆర్టీయూ మాజీ అధ్యక్షుడు పి.వెంకట్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కొత్తకోట పట్టణ కేంద్రంలో రిటైర్డ్ ఉద్యోగుల కార్యాలయంలో రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయులతో కలిసి వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు, పెన్షనర్లకు రానున్న పే రివిజన్ కమిషన్‌లో 50శాతం ఫిట్‌మెంట్ అందిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు రావాల్సిన 4 డీఏలలో 2డీఏ ఇవ్వాల్సిందిగా, ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లించడం, వేతనాలలో 1శాతం మినహాయించుకొని హెల్త్ కార్డులపైన అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత చికిత్స అందించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరగా అందుకు సీఎం సానుకూలంగా స్పందించారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కావాలంటే మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డిని ప్రతి ఉద్యోగి, రిటైర్డ్ ఉద్యోగులు గెలిపించాలన్నారు.

చేతబడి చేసిందని..

- వృద్ధురాలి హత్యాయత్నం కేసు ఛేదించిన పోలీసులు



ఖిల్లాఘనపురం: చేతబడి చేసిందనే అనుమానంతోనే వృద్ధురాలిని హత్య చేసేందుకు పూనుకున్నామని నిందితులు పోలీసుల ఎదుట ఒప్పుకున్నారు. వివరాల్లోకి వెళితే వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలంలోని సోళీపురంలో గురువారం మధ్యరాత్రి సమయంలో ఓ వృద్ధురాలిపై హత్యాయత్నం జరిగింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఖిల్లాఘనపురం పోలీసులు ఒక్క రోజులోనే కేసును ఛేదించి దుండగులను పట్టుకున్నారు. ఈ విషయమై శనివారం ఎస్ఐ శ్రీహరి దుండగులను మీడియా ముందుకు తీసుకొచ్చారు. ఆయన వివరాల ప్రకారం సోళీపురం గ్రామానికి చెందిన మీసాల బాల్‌రాజు తండ్రి మీసాల పెద్ద రాములు సుమారు పదేళ్ల క్రితం మృతి చెందాడు. అదేవిధంగా గ్రామానికి చెందిన మహేష్ సోదరుడు నరేష్ ఇటీవల కాలుకు సర్జరీ అయి మృతి చెందాడు. అయితే ఇద్దరి చావుకు వృద్ధురాలు చంద్రమ్మనే కారణమని, ఆమె తన భర్తతో కలిసి చేతబడి, బాణామతి చేసి చంపినట్లు అనుమానించారు. మీసాల బాల్‌రాజు, మహేష్ బావ బావమరుదులు అవుతారు. కొందరు వ్యక్తులు చెప్పిన మాటలు నమ్మిన వారు వృద్ధురాలిని ఎలాగైన చంపాలని నిర్ణయించుకున్నారు. అయితే చనిపోయిన నరేష్ బట్టలు వేసుకుని వృద్ధురాలిని చంపితే అతడి ఆత్మకు శాంతి చేకూరుతుందని భావించిన గురువారం తెల్లవారుజామున మద్యం సేవించి వేటకొడవలితో బాల్‌రాజు వృద్ధురాలిపై దాడి చేశారు. మహేష్ ఆ ప్రాంతానికి ఎవరు రాకుండా కాపలా కాశాడు. చనిపోయిందనుకున్న వారు అక్కడి నుంచి పరారయ్యారు. రక్తపు మరకలు అంటిన బట్టలు, వేటకొడవలిని వనపర్తి శివారులోని ట్యాంక్‌బండ్‌లో పారవేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నారు. నిందితులు బట్టలు, వేటకొడవలి వేసిన ప్రాంతాన్ని చూపించినట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు. ప్రాథమిక ఆధారాలతో అదుపులోకి తీసుకున్న నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారనలి పేర్కొన్నారు.

క్రమం తప్పకుండా మందులు వాడాలి



జమ్మాపూర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి

పాన్‌గల్: వైద్యుల సూచనలను పాటిస్తూ క్రమం తప్పకుండా మందులు వాడితే టీబీ నయమవుతుందని పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని జమ్మాపూర్, కేతేపల్లి గ్రామాల ఆరోగ్య ఉప కేంద్రాలను సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న వైద్య సేవలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లో టీబీ రోగులను కలిసి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం, మందుల వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా తీసుకునేలా తల్లిదండ్రులకు తెలియపర్చడం, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా చేరేలా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, శ్రీలక్ష్మి, శైలాజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ గణన ఎందుకు చేయలేదు?



మాట్లాడుతున్న రాచాల యుగంధర్‌గౌడ్

కొత్తకోట: దేశవ్యాప్తంగా బీసీల ఆకాంక్షలు నెరవేర్చాలంటే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడమే ఏకైక పరిష్కారమని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ పాలనలో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని, ప్రధానిగా ఓబీసీకి చెందిన ప్రధాని మోదీ ఉన్నప్పటికీ బీసీలకు న్యాయం చేయలేదని వాపోయారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు, దేశవ్యాప్తంగా ఇండియా కూటమికీ బీసీలంతా స్వచ్ఛందంగా మద్దతు ఇస్తున్నారని తెలిపారు. చట్ట సభల్లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ, బీసీ కుల గణన, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించకుండా అన్యాయం చేశారని ఆరోపించారు. బీసీలు కూడా హిందువులేనని, బీసీలపై కపట ప్రేమ చూపిస్తున్న బీజేపీని బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గడిచిన 10 ఏళ్లలో ఎంత నల్లధనాన్ని తీసుకొచ్చారో లెక్క చెప్పాలని, బ్యాంకులను ముంచిన బడా బాబులకు రుణాలు మాఫీ చేసిన ఘనత దేశ చరిత్రలో నరేంద్రమోదీకే దక్కిందని ఎద్దేవా చేశారు. ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయేజ్, శ్రీనివాస్‌రెడ్డి, మహదేవ్‌గౌడ్, సాక బాలనారాయణ, రాంమోహన్‌రెడ్డి, అంజన్నయాదవ్, శివయాదవ్, మహేందర్, శంకర్‌యాదవ్, రాజు, కై సర్, ఖాజా, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

చిన్నారి గొంతులో ఇరుక్కున్న క్యారెట్ ముక్క

- అపస్మారక స్థితిలో చిన్నారి
- అరుదైన చికిత్స చేసి ప్రాణాలు కాపాడిన డాక్టర్లు



చిన్నారికి బ్రాంకోస్కోప్ చేస్తున్న వైద్యులు

కొత్తకోట: చిన్నారి గొంతులో క్యారెట్ ముక్క ఇరుక్కుపోయి ఊపిరాడకుండా ఇబ్బంది పడిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణ కేంద్రానికి చెందిన ఎండీ జహీర్, అస్రాపర్‌వీన్ దంపతుల కుమార్తె ఫిజా అనే ఏడాది చిన్నారి ఇంట్లో ఆడుకుంటూ క్యారెట్ ముక్కను తినేందుకు ప్రయత్నించింది. అయితే క్యారెట్ ముక్క లోపలికి వెళ్లకుండా గొంతులో ఇరుక్కోవడంతో ఊపిరాడక చిన్నారి ఇబ్బంది పడింది. గమనించిన తల్లిదండ్రులు వెంటనే స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది రావడంతో చిన్నారి స్పృహ కోల్పోయింది. వెంటనే అప్రమత్తమైన డాక్టర్ మనీషారెడ్డి తక్షణమే సీపీఆర్ మొదలు పెట్టారు. నోటిలో గొట్టం వేసి వెంటిలేటర్ సాయంతో కృత్రిమ శ్వాస అందించారు. పాప పరిస్థితి నిలకడ ఉండటంతో హైదరాబాద్ నుంచి ఇంటర్నేషనల్ పాల్మోనాలజిస్ట్ డాక్టర్ వెంకట్‌రెడ్డి, వారి బృందాన్ని పిలిపించారు. చెక్ బ్రాంకోస్కోప్ చేయడంతో ఊపిరితిత్తుల మధ్యలో క్యారెట్ ముక్క ఇరుక్కున్నట్టు గుర్తించి, తొలగించారు. ఆరోగ్యం నిలకడగా ఉండడంతో వైద్యులు చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించారు. చిన్నారి ప్రాణాలు కాపాడిన వైద్య సిబ్బందిని ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ హరిన్‌రెడ్డి అభినందించారు.

ఓటర్ల ధైర్యం కోసమే కవాతు



ఉండవెల్లి: మండలంలోని కంచుపాడు, తక్కశిల గ్రామాల్లో ఐటీబీపీ జవాన్లు ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. కంచుపాడులో బస్టాండ్ నుంచి ఆలయం వయా గ్రామ చివరి వరకు కవాతు నిర్వహించారు. తక్కశిలలో చర్చి నుంచి మిట్టపాడు వరకు జవాన్లు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది నాగేష్, హుస్సేన్ తదితర్లు పాల్గొన్నారు.

కాషాయం జెండా తొలగింపుపై ధర్నా

చిన్నచింతకుంట: మండల కేంద్రంలో పంచాయితీ సిబ్బంది కాషాయం జెండాలను తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం సాయంత్రం బీజేపీ, హిందు సంఘాల ఆధ్వర్యంలో బస్టాండ్ కూడలిలో ధర్నా చేపట్టారు. పార్టీ జిల్లా నాయకుడు కుర్వ రమేష్ జెండాలను తొలగించడం సరికాదన్నారు. విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఘటన స్థలానికి ఏఎస్ఐ వెంకటస్వామి చేరుకోని సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశానుసారం చర్యలు తీసుకునేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో నాయకులు ధర్నాను విరమించారు.

ఆరు గ్యారంటీల అమలులో విఫలం



వనపర్తిలో ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలు అమలు చేయటంలో విఫలమైందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆయా కాలనీల్లో పర్యటించి బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. వనపర్తి పట్టణంలో దశాబ్దాల నాటి కల రోడ్ల విస్తరణ, చెరువుల మరమ్మతు, సాగు నీరు, శాశ్వత తాగునీరు, ఉన్నత విద్యాలయాలు, జిల్లా ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమములో జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పలుస రమేష్‌గౌడ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: కాంగ్రెస్, బీజేపీ అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేస్తున్నాయని, కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, మండల అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. శనివారం ఆత్మకూర్ పట్టణం, గ్రామాల్లో బీఆర్ఎస్ పార్లమెంటు అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండ్లరామకృష్ణ, కొత్తబోయశేఖర్, హాశం, రియాజ్ఆలీ, అజ్జర్, తోటరవి పాల్గొన్నారు.

పాన్‌గల్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికలల్లో తగిన బుద్ధి చెప్పాలని ఎంపీపీ మామిళ్లపలి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు చిక్కేపల్లి, కదిరెపాడు గ్రామాల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాంచందర్‌యాదవ్, ధర్మారెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాలస్వామియాదవ్, వెంకట్రాములు, నర్సింహ, సత్యం, సుధాకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నంబావి: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బీఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మండలంలోని కొప్పునూరులో ఎంపీటీసీ తగరం లక్ష్మి ఆధ్వర్యంలో ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో రాజేశ్వర్‌రెడ్డి ఆనంద్‌యాదవ్, కురుమయ్య, దేగ శేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎత్తం శివ, నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీతోనే దేశ రక్షణ



కేతేపల్లిలో బీజేపీ నాయకుల ప్రచారం



ఆత్మకూర్‌లో..

ఆత్మకూర్: ప్రధానమంత్రి మోదీతోనే దేశ రక్షణ, అభివృద్ధి సాధ్యమని, పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు గెలిపించాలని బీజేపీ నాయకులు కోరారు. శనివారం ఆత్మకూర్‌తో పాటు మండలంలోని గ్రామాల్లో బీజేపీ అభ్యర్థికి మద్దతుగా నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పురఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్, శ్రీనివాస్, అనిల్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, ఆనంద్, బాలకృష్ణ, సద్దలవెంకట్, శ్యాం, సూరి పాల్గొన్నారు.

పాన్‌గల్: బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగం ప్రమాదంలో పడుతుందని, రాజ్యాంగాన్ని మారుస్తారని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారం మానుకోవాలని పార్టీ తమిళనాడు ఆర్గనైజింగ్ సెక్రెటరీ మారీ ముత్తు, జనరల్ సెక్రటరీ రంగరాజన్ అన్నారు. శనివారం మండలంలోని కేతేపల్లిలో నాగర్‌కర్నూల్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అన్వేష్, నాగరాజు, వెంకటేష్‌యాదవ్, శివరాం పాల్గొన్నారు.

అమరచింత: మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణను గెలిపించాలంటూ బీజేపీ నాయకులు పట్టణంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు, నరాల నారాయణ, వెంకటేశ్వర్లు, మరాఠి ఆశోక్, క్యామ భాస్కర్, అనిల్, అంజి, రవి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

‘రిజర్వేషన్లు ఎత్తేసే కుట్ర జరుగుతోంది’



వనపర్తిలో మాట్లాడుతున్న చిన్నారెడ్డి



ముందరితండాలో మాట్లాడుతున్న తూడి శ్రీనివాస్‌రెడ్డి



వెల్టూరులో మల్లు రాజాబాన్సీ



ఆత్మకూర్‌లో..

సాక్షి, నెట్‌వర్క్: అన్ని వర్గాల ప్రజలను అక్కున చేర్చుకొని రాజ్యాంగాన్ని ప్రాణపదంగా భావించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, రాష్ట్ర గీతకార్మిక చైర్మన్ కేశం నాగరాజుగౌడ్, మల్లు రవి సతీమణి రాజాబాన్సీదేవి అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవికి మద్దతుగ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు ఎత్తేసే ప్రమాదం ఉందన్నారు. బంగారు తెలంగాణ ముసుగులో బీఆర్ఎస్ రాష్ట్రాన్ని దోచుకుందని మండిపడ్డారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీ చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ జిల్లెల ఆదిత్యారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, కాంగ్రెస్ జిల్లా మహిళ అధ్యక్షురాలు శ్రీలతరెడ్డి, తూడి శ్రీనివాస్‌రెడ్డి, తూడి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ రఘుప్రసాద్, శంకర్‌ప్రసాద్, కిరణ్ కుమార్, ఖమ్మర్‌మియా, రాష్ట్ర పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి గంజి శ్రీనివాసులు, సత్యారెడ్డి, గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, తులసిరాజ్, నల్గొండశ్రీను, చంద్రశేఖర్ యాదవ్, బీచుపల్లి యాదవ్ ,బాలు,వడ్డెమాన్ బిచ్చన్న,నారయణ,ప్రకాష్,తదితరులు పాల్గొన్నారు.